నీటి ఎద్దడితో పుర ప్రజల ఇబ్బందులు

- పైపులైన్ల లీకుల కారణంగా కలుషితం అవుతున్న నీరు
- సత్ఫలితాలివ్వన్ని ప్రణాళిక లేని నివారణ చర్యలు
- శివారు ప్రాంతాలకు ట్యాంకర్లే శరణ్యం



కర్లపాలెం రోడ్డులో లీకులు



మురికిగా వస్తున్న మున్సిపాలిటీ నీరు

బాపట్ల : నీటి కాలుష్యంతో పురప్రజలు అల్లాడిపోతున్నారు. లీకులు నివారించేందుకు అధికారులు ముమ్మరంగా చర్యలు చేపడుతున్నా ప్రణాళికలు లేకుండా చేస్తోన్న పనులు సత్ఫలితాలు ఇవ్వటం లేదు. లీకుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో మురుగు నీరు సరఫరా అవుతుంది. బాపట్ల జిల్లా కేంద్రం 1.10 లక్షల జనాభాకు చేరింది. రోజుకు ఒక్కొక్కరికి 180 లీటర్లు నీటి సరఫరా చేయాల్సి ఉండగా కేవలం 100 లీటర్లు మాత్రమే సరఫరా చేస్తున్నారు. కుళాయిలు 6 వేల వరకు ఉన్నాయి. మొత్తం 20 కిలోమీటర్లు పొడవునా మంచినీటి పైపులైన్లు ఉండగా 42 ఏళ్ల క్రితం వేసిన పైపులైన్లు కావటంతో లీకులు అధికంగా ఉన్నాయి. ఇప్పటికీ తాగునీటి పైపులైన్లు లేక శివారు ప్రాంతాల ప్రజలు నీటి కోసం ట్యాంకర్లపైనే ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి. శివారు ప్రాంత వాసులు పైపులైన్లు వేసి నీటిని అందించాలని కోరుతున్నారు.

లీకులు ఉన్న ప్రాంతాలు

పట్టణానికి ప్రధాన రహదారైన గుంటూరు–బాపట్ల, చీరాల రోడ్డులో నిత్యం లీకులతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన పైపులైనుకు లీకులు ఉండటం వలన అంతర్గత పైపులైన్లు కూడా లీకు నీళ్లు వస్తున్నాయి. పైపులైన్లకు లీకులు ఏర్పడడంతో తాగునీరు కలుషితం అయి మురికిగా వస్తుందని ప్రజలు చెబుతున్నారు. కర్లపాలెం రోడ్డు, దగ్గుమల్లివారిపాలెం, ప్యాడిసన్‌పేట, మూర్తిరక్షణనగర్, రామకృష్ణపురం ప్రాంతాల్లో ఎక్కువగా లీకులు తరచూ ఏర్పడుతున్నాయి.

నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలు ఇవే

పట్టణంలో రెల్లికాలనీ, పేయింటర్స్‌కాలనీ, వైఎస్సార్ కాలనీ, శారదపురి కాలనీ, గులాంహుస్సేన్ తోట, చాకలిపాలెం, విశ్వబ్రహ్మణ కాలనీలలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉంది. మున్సిపల్ అధికారులు సరఫరా చేసే నీరు ఈ ప్రాంతాల వరకు అందడం లేదు. వీరికి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీరే దిక్కు. అది కూడా అరకొరగా అందించడంతో నీటి ఎద్దడితో అల్లాడుతున్నారు.

ట్యాంకర్లు కొన్ని ప్రాంతాలకే పరిమితం

నీటి ఎద్దడి ఎక్కువగా ఉన్నప్పటికీ మున్సిపల్ అధికారులు సరిగా స్పందించటం లేదు. ట్యాంకర్ల సరఫరా విషయంలో కూడా కొన్ని ప్రాంతాలకే పరిమితం చేస్తున్నారు. గణాంకాల్లో చాంతాడు అంత జాబితా ఉన్నప్పటికీ సరఫరా విషయంలో అరకొరగానే కనిపిస్తోంది. ఒక పక్కన నీటి ఎద్దడి లేకుండా చూడాలంటూ సాక్షాత్తు జిల్లా కలెక్టర్ సైతం అధికారులను ఆదేశిస్తుంటే మున్సిపల్ అధికారులు మాత్రం మిన్నకుండిపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మంచినీటి ట్యాంకర్లతో నైనా నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు

రేపల్లె: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, బాపట్ల ఆధ్వర్యంలో ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్‌లో పలు కోర్సులలో ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సి.రవి చంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగ అభ్యర్థులకు స్కిల్ హబ్ సెంటర్‌లో పరిశ్రమలకు అనుగుణంగా శిక్షణ అందించి, అనంతరం అభ్యర్థులకు జాతీయ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల నుంచి సర్టిఫికెట్ అందించబడునన్నారు. అర్హతలను బట్టి అభ్యర్థులకు ఆయా కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడునని తెలియజేశారు. శిక్షణకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి, ఇంటర్, ఏదైనా డిగ్రీ ఆ పైన చదివిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్ డెవలపర్, అకౌంట్స్ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9347468946ను సంప్రదించాలన్నారు.

రెండో రోజుకు చేరిన ఆర్టీసీ కార్మికుల రిలే దీక్ష



రేపల్లె: సమస్యల సాధన కోసం నేషనల్ మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు రేపల్లె ఆర్టీసీ డిపోలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష మంగళవారం రెండో రోజుకు చేరింది. కార్మికులకు పదోన్నతులు కల్పించాలని, పని ఒత్తిడి తగ్గించాలని, డిపోలో సమస్యలను పరిష్కరించాలని రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఎంయూ జిల్లా సంయుక్త కార్యదర్శి వీఎస్ వాసు తెలిపారు. దీక్షలో జి.శివప్రసాద్, జీవీ రాఘవయ్య, బి.శ్రీనివాసరావు, ఐలవరం బాలకృష్ణ, శ్యామ్ బాబు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి



రేపల్లె: పని ప్రదేశంలో కార్మికులకు యజమానులు కనీస సౌకర్యాలు కల్పించాలని కార్మిక శాఖ అధికారి ప్రభాకర్‌రావు చెప్పారు. పట్టణంలో పలు ప్రాంతాలను మంగళవారం ఆయన సందర్శించి భవన నిర్మాణ కార్మికులు, యజమానులతో మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని కార్మికుల కోసం పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ వేడిమి అధికంగా ఉంటున్నందున మధ్యాహ్న భోజన విరామ సమయంలో రెండు గంటలు కార్మికులకు విశ్రాంతిని ఇవ్వాలన్నారు. కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టని యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. కార్మికులకు ఎటువంటి అపాయం సంభవించిన యజమానులే బాధ్యత వహించాలన్నారు. అదేవిధంగా వ్యాపార సముదాయాలు, హోటల్స్‌లో పనిచేసే కార్మికులకు కనీస వసతులు కల్పించాలని కోరారు.

నేటి నుంచి శంకరాచార్యుల జయంత్యుత్సవాలు



బాపట్ల : బాపట్లలోని శంకర విద్యాలయంలో శంకరాచార్యుల జయంతి వేడుకలు బుధవారం నుంచి శుక్రవారం వరకు జరుగుతాయని సంయుక్త కార్యదర్శి భుజగేంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు జయంతి ఉత్సవాల కరపత్రాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా భుజగేంద్రమౌళి మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా బుధవారం గణపతి పూజ, గురువారం లక్ష్మీహవనం, శుక్రవారం రుద్ర హవనం నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పాల్గొనాలని కోరారు. కరపత్రాలను ఆవిష్కరించిన వారిలో భార్గవ సాయి లక్ష్మి గణేష్ శర్మ, తంగిరాల వెంకట కాశి విశ్వసాయి, శ్రీకాంత్ శర్మ పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



నగరం: వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రిపాలెం గ్రంథాలయ శాఖ నిర్వాహకుడు బహ్మేంద్ర తెలిపారు. మండలంలోని మంత్రిపాలెం గ్రంథాలయంలో జరుగుతున్న విజ్ఞాన శిబిరాలను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. వేసవి సెలవులలో విద్యార్థులకు పుస్తక పఠనం, సమీక్ష, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిక్షణనిస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని గ్రంథాలయం పరిధిలోని విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు



మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాణిశ్రీ

నగరం: ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల ఆరోగ్యవంతమైన పంటలు పండించవచ్చని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.వాణిశ్రీ చెప్పారు. మండలంలోని పూడివాడ గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన అవగాహన సదస్సులో వాణిశ్రీ పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ విధానం వల్ల నేల సారవంతంతో పాటు పంటలు ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేలా వ్యవసాయ శాఖ సిబ్బంది కృషి చేయాలని కోరారు. రేపల్లె ఏడీఏ ఆర్.విజయబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, రసాయనిక ఎరువుల వల్ల కలిగే దుష్పరిణామాలపై వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు, ఏపీఎం కృపాసాగర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాజధాని పునః నిర్మాణం

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు

వేమూరు: కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయకుండా రాజధాని పునః నిర్మాణం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హడావుడి చేస్తున్నారని, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. చెరుకుపల్లి పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి ఏడాది కాలంలో వచ్చిన ప్రజా వ్యతిరేకత నుంచి దృష్టిని మళ్లించేందుకు రాజధాని నిర్మాణ శంకుస్థాపనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని పిలిపించి హంగామా చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత కూటమి ప్రభుత్వంలో ప్రధాని మోదీ చేత రాజధాని నిర్మాణానికి శంకుస్థాపన చేయించారని ఆయన గుర్తు చేశారు. కూటమి నుంచి బయటకు వచ్చిన తర్వాత ప్రధాని మోదీని ఏ విధంగా విమర్శించారో తెలుసుకోవాలన్నారు. నూతన రాజధాని నిర్మాణానికి నిధులు అందించకుండా నీరు, మట్టి ఇచ్చారని ఆనాడు చంద్రబాబు ప్రధానమంత్రి మోదీని విమర్శలు చేసింది ప్రజలు మరిచి పోలేదన్నారు. మరలా ప్రధాని మోదీ చేత పునః నిర్మాణ శంకుస్థాపన పేరుతో చంద్రబాబు పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను మళ్లించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజధాని నిర్మాణానికి ఏనాడు అడ్డు పెట్టలేదన్నారు. అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నది జగన్‌మోహన్ రెడ్డి ఉద్దేశమని అశోక్‌బాబు తెలిపారు. రాజధాని పేరుతో జరిగిన అక్రమాలు, భూ మాఫియా గురించి జగన్‌మోహన్ రెడ్డి తప్పు పట్టారే తప్ప రాజధాని నిర్మాణానికి వ్యతిరేకం కాదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, టీడీపీ నేతలు రాజధాని నిర్మాణం పేరుతో భూ మాఫియాకి పాల్పడుతున్నారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉపాధి హామీ పనికి దరఖాస్తు చేసుకోవాలి

ఎంపీడీవో అత్తోట దీప్తి



తెనాలిటౌన్: ఉపాధి హామీ పనికి దరఖాస్తు చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి అత్తోట దీప్తి సూచించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్ఆర్‌జీఎస్ పథకం కింద మండల పరిధిలో నాలుగు వేల మందికి ఉపాధి కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలియజేశారు. అయితే ప్రస్తుతం 1,500 మందికి మాత్రమే పని కల్పించినట్లు చెప్పారు. అంగలకుదురు, నందివెలుగు, హాఫ్‌పేట, కొలకలూరు, పెదరావూరు గ్రామాల్లో కాల్వలోకి నీరు చేరడం వలన పని కల్పించలేకపోయినట్లు తెలియజేశారు. మేజర్‌మెంట్స్‌కు అనుగుణంగా రోజుకు కనీసం రూ.307 పనికి వేతనంగా ఇస్తున్నట్లు చెప్పారు. జాబ్‌కార్డు లేకపోతే దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు. హౌసింగ్ స్కీం కింద ఇల్లు మంజూరయి గతంలో కట్టుకులేని వారికి ప్రస్తుతం అదనంగా నగదు మంజూరైనట్లు తెలిపారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఇస్తున్నట్లు వివరించారు. మండల పరిధిలో 548 మందికి కేటాయింపులు రాగా 158 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినట్లు చెప్పారు. జూన్ 18న పూర్తి నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. కొలకలూరు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని యుద్ధ ప్రాతిపదికన గ్రామంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తున్నట్లు వివరించారు.

చిరువ్యాపారిపై మున్సిపల్ ఉద్యోగుల కర్కశం

- హోటల్ సామాను తీసుకెళ్లేందుకు ప్రయత్నం
- కిరోసిన్ పోసుకోవటంతో తాత్కాలికంగా విరమణ

తెనాలి: రోడ్లు ఆక్రమించుకుని యథేచ్ఛగా వ్యాపార దుకాణాలను నిర్వహిస్తున్న ఎందరినో వదిలేసిన మున్సిపల్ పాలకులు దశాబ్దాలుగా హోటల్ నడుపుకుంటున్న చిరు వ్యాపారిపై పడ్డారు. ఆయన జీవనోపాధిని దెబ్బతీసేందుకు ప్రయత్నించారు. ఉపాధి కోల్పోతే తనకు మరణమే శరణ్యమన్న నిర్వేదంతో ఆ చిరు వ్యాపారి కిరోసిన్ పోసుకోవటంతో తాత్కాలికంగా ఆగారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేటలోని మండల తహసీల్దార్ కార్యాలయం ఉత్తరం ప్రహరీ వద్ద చిన్న హోటల్ ఎప్పటి నుంచో నడుస్తోంది. ముప్వల శ్రీరామమూర్తి, నాగమల్లేశ్వరి దంపతులు ఆ హోటల్‌ను నడుపుకుంటున్నారు. నాలుగున్నర దశాబ్దాల క్రితం శ్రీరామమూర్తికి అక్కడ హోటల్ నడుపుకునేందుకు అనుమతినిచ్చారని చెబుతున్నారు. మున్సిపాలిటీకి చట్టబద్ధంగా పన్నులు చెల్లిస్తూ అధికారికంగా ఆ హోటల్ కొనసాగుతోంది. కాగా ప్రస్తుతం ఆ స్థలం రెవెన్యూ అసోసియేషన్‌కు వెళ్లింది. అక్కడ అసోసియేషన్ కార్యాలయం కోసం నిర్మాణం చేస్తామని, అక్కడ నిర్మించే కాంప్లెక్సులో హోటల్‌కు అనుమతిస్తామని హోటల్ నిర్వాహకులకు చెప్పారు. అప్పటి వరకు తమ సంగతేంటన్న ప్రశ్నకు సమీపంలోని బాలుర హైస్కూలు గోడ పక్కన తాత్కాలికంగా నిర్వహించుకోవాలని అధికారులు సూచించారు. ఆ ప్రకారం హోటల్‌ను ఏర్పాటు చేసుకుంటున్న క్రమంలో మంగళవారం వెంకట్రామయ్య అనే మున్సిపల్ ఉద్యోగి, సిబ్బందితో సహా వచ్చి సామాన్లు వాహనంపైకి ఎక్కించారు. దీంతో జీవనోపాధి పోతుందన్న నిరాశతో శ్రీరామమూర్తి ఒంటిపై కిరోసిన్ పోసుకోవటంతో సామాన్లు వదిలేసి వెళ్లారు. కాంప్లెక్స్ నిర్మాణం పూర్తయి తమకు షాపు కేటాయించే వరకు హోటల్ నిర్వహణకు అనుమతించాలని ఆ దంపతులు ప్రాధేయపడుతున్నారు.

ఈతకు వెళ్లి.. మృతుడయ్యాడు!

తెనాలిరూరల్: పట్టణ చెంచుపేటకు చెందిన ప్రసాద్ (23) మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామంలో కొమ్మమూరు కాల్వలో ఈతకు దిగి సోమవారం గల్లంతయ్యాడు. మృతదేహాన్ని పోలీసులు మంగళవారం గుర్తించి తెనాలి జిల్లా వైద్యశాల మార్చురీకి తరలించారు. బుధవారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్టు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత



రేపల్లె: అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు మంగళవారం చేయూతనిచ్చారు. వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ ఆదేశాల మేరకు 18వ వార్డులోని అగ్ని ప్రమాద బాధితులు కారుమూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రూ.5 వేల నగదు, నిత్యావసర వస్తువులు, దుస్తులు, వంట సామగ్రి, కూరగాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, నాయకులు చందోలు నాగలక్ష్మి, సజ్జ పద్మావతి, శారద, సుజాత తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం




తెనాలిఅర్బన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ ఆధ్వర్యంలో మే నెల 4వ తేదీ నుంచి చిన్న పిల్లలకు ఉచిత యోగ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బైసాని సూర్యనారాయణ తెలిపారు. శిక్షణ శిబిరంకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం తెనాలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగానమ్మపేటలోని చుండూరు వారి సత్రంలో ప్రతిరోజు ఉదయం ఆరు గంటల నుంచి ఏడు గంటల వరకు యోగ శిక్షణ శిబిరం జరుగుతుందని చెప్పారు. వారం రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ అవకాశాన్ని చిన్నారులు ఉపయోగించుకోవాలని కోరారు.

మున్సిపాలిటీ మేనేజరుగా జయకర్



తెనాలి: పట్టణ మున్సిపాలిటీ మేనేజరుగా కేడబ్ల్యూ జయకర్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తణుకు మున్సిపాలిటీలో కేడర్–2 మేనేజరుగా పనిచేస్తున్న జయకర్‌ను పదోన్నతిపై కేడర్–1 మేనేజరుగా నియమించారు. త్వరలో ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు. గతంలో వీరు తెనాలి మున్సిపాలిటీలో రెవెన్యూ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

అన్నసంతర్పణకు నిత్యావసరాలు పంపిణీ



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామం బాపయ్యపేటలో వేంచేసియున్న ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నందు ప్రతి ఏటా ఆంజనేయస్వామి మాలధారులకు దేవస్థానం ఆధ్వర్యంలో 41 రోజుల పాటు అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా బీజేపీ ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ కాలిశెట్టి రమేష్‌బాబు, ఆయన మిత్ర బృందం ఆధ్వర్యంలో ఒక రోజు అన్న సంతర్పణకు అవసరమైన నిత్యావసరాలను దేవస్థాన కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు వెలివెల అనిల్, జనసేన నాయకులు తోట నరేంద్ర, బండి చంద్రమోహన్, షేక్ సలీమ్ షా, ఎం.రాఘవయ్య, పి.కోటేశ్వరరావు, నాగరాజు, పవన్‌కుమార్, వెంకటేశ్వరరావు, నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

హనుమత్ శోభాయాత్రను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు

రేపల్లె: హనుమత్ జయంతిని పురస్కరించుకొని చైతన్య వేదిక, సమరసత సేవా ఫౌండేషన్, విశ్వ హిందూ పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మే 18వ తేదీన నిజాంపట్నం మండలం గరువుపాలెం హనుమాన్ విగ్రహం నుంచి నగరం హనుమాన్ దేవాలయం వరకు జరుగు శోభాయాత్రని జయప్రదం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని పోట మెరక వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి శోభాయాత్ర కరపత్రాలను విడుదల చేసి గ్రామస్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందువుల ఐక్యతను చాటి చెప్పేలా 18వ తేదీన జరిగే శోభాయాత్రలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు గరువుపాలెం నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర నగరం హనుమాన్ ఆలయం వరకు సాగుతుందన్నారు. శోభాయాత్రలో హిందూ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొంటారని తెలియజేశారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ ధర్మ ప్రచారకులు జంజనం హేమ శంకరరావు, మహేష్, వీర రాఘవయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు



సమస్యలు పరిష్కారించాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ నిరాహార దీక్ష

బాపట్ల: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహనరావు కోరారు. సమస్యలు పరిష్కారం కోరుతూ బాపట్ల డిపో కేంద్రం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ 1–1–2019 ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని, ఆగిపోయిన ప్రమోషన్స్‌ను వెంటనే ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు చిన్న పిల్లల సంరక్షణ సెలవులు ఇవ్వాలని, గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని సూచించారు. దీక్షలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాసరాజు, జిల్లా కార్యదర్శి తులసి శ్రీనివాసరావు, బాపట్ల డిపో అధ్యక్ష కార్యదర్శులు జగన్‌మోహనరావు, శ్రీనివాసరావు, కోశాధికారి ప్రవీణ్, బాపట్ల ఎన్ఎంయూఏ సభ్యులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాల అభ్యున్నతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో ప్రభాకర్‌రావు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పీ–4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల(నిరుపేద కుటుంబాలు) అభ్యున్నతికి కృషి చేయాలని డీపీవో కేఎల్ ప్రభాకర్‌రావు చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం కర్లపాలెం, పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు బంగారు కుటుంబాల అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీవో మాట్లాడుతూ పీ–4 సర్వేలో గుర్తించిన మొత్తం బంగారు కుటుంబాలను 7 నుంచి 10 గ్రూపులుగా విభజించి వారి అభ్యున్నతి కోసం మార్గదర్శకులను ఎంపిక చేయాలని చెప్పారు. బంగారు కుటుంబాలలోని వారికి కావలసిన ఆధార్, రేషన్ కార్డులు లాంటివి త్వరితగతిన మంజూరు చేయించాలని చెప్పారు. డీఎల్‌డీవో సీహెచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ పిట్టలవానిపాలెం మండలంలో ఉన్న 14 పంచాయతీలలో పీ–4 సర్వే ద్వారా మొత్తం 1,822 బంగారు కుటుంబాలను గుర్తించారని చెప్పారు. ఆర్థికంగా స్థిరపడిన వారు, విదేశాల నుంచి వచ్చిన వారు, ప్రభుత్వ, ప్రైవేటు రంగాలలో అభివృద్ధి చెందిన వారిని బంగారు కుటుంబాల అభివృద్ధికి మార్గదర్శకులుగా ఎంపిక చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిట్టలవానిపాలెం మండల ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, కర్లపాలెం ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రేమాభిమానాలు మరిచిపోలేనివి

ఏడీ కె.సుభాషిణి



ఏడీని సన్మానించిన జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు

బాపట్ల: మీరు చూపిన ప్రేమ, ఆదరాభిమానాలు ఎప్పటికీ మరువలేనివని జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి, సహాయ సంచాలకులు కె.సుభాషిణి అన్నారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ పొందుతున్న సహాయ సంచాలకులు సుభాషిణికి మీడియా ప్రతినిధులు స్థానిక డీపీఆర్‌ఓ కార్యాలయంలో మంగళవారం అభినందన వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. శాలువలు, పుష్పగుచ్ఛాలతో ఆమెను మీడియా ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కృష్ణానది వరద విపత్తు సమయంలో బాపట్ల జిల్లాలో సమర్థంగా పనిచేయడం విజయమేనని సహాయ సంచాలకులు చెప్పారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల సహకారం మరిచిపోలేనన్నారు. వారి సహకారంతో ఇంత కాలం బాపట్ల జిల్లాలో పనిచేయగలిగానన్నారు. బాపట్ల జిల్లాలో ఎన్నికల నిర్వహణ, తుపాను సమయంలోనూ ప్రభుత్వం నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో మీడియా ప్రధాన పాత్ర పోషించిందన్నారు. ఆ సమయంలో మీ సహకారంతోనే ముందుకు సాగామన్నారు. మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియలోను వారు ఎంతో సహకారం అందించారన్నారు. ఒక అధికారిగా కాకుండా ఒక సోదరి వలె చూసుకున్నారని, సోదర భావంతో కలిసి పనిచేయడానికి ఎన్నో అవకాశాలు కల్పించిన విషయాలను ఆమె మననం చేసుకున్నారు. మీడియా ప్రతినిధుల సహకారంతోనే ఇక్కడ పనిచేసినంతకాలం జిల్లా కలెక్టర్లందరూ బాగా ప్రోత్సాహం అందించారన్నారు. బాపట్ల జిల్లాలో పనిచేయడం గొప్ప అనుభవాన్ని నేర్పిందన్నారు.

కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న కేంద్రం



సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు

మంగళగిరి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని సి.ఐ.టి.యు కార్యాలయంలో మంగళవారం పలు కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ, సీఐటీయూసీ, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు హాజరయి మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులకు నష్టం కలిగించే మూడు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని అన్నారు. దీనికి వ్యతిరేకంగా రైతులు ప్రాణాలు అర్పించి రద్దు చేయించారని గుర్తు చేశారు. అయినప్పటికీ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వర్గాలు పోరాటాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసిందని విమర్శించారు. కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ ప్రభుత్వానికి సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మే 17వ తేదీన బైక్ ర్యాలీ నిర్వహించాలని తీర్మానించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ నాయకులు ఎన్.నాగరాజు, డి.అమరేశ్వరరావు, రత్నాకం శ్రీనివాసరాజు, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుచ్చిబాబు, శ్రీనివాసులు, సీఐటీయూ నాయకులు బాలాజీ, చెంగయ్య, ఏఐటీయూసీ నాయకులు ప్రభాకర్, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.